క్లుప్తంగా

చిన్నగిరి మల్లమ్మ తల్లి ఊరేగింపు


ఉత్సవమూర్తిని ఊరేగిస్తున్న భక్తులు

పెద్దపప్పూరు: మండలంలోని పి.కొట్టాలపల్లిలో సోమవారం అక్కమహా దేవతల్లో ఒకరైన చిన్నగిరి మల్లమ్మ తల్లి ఉత్సవమూర్తిని గ్రామంలో ఘనంగా ఊరేగించారు. నూతనంగా రూ.45 వేల వ్యయంతో అమ్మవారి ప్రతిమను వెండితో చేయించి, మొక్కుబడిలో భాగంగా ఊరేగింపు చేపట్టినట్లు పాత్తూరు రాజగోపాల్ నాయుడు, వెంకటలక్ష్మి దంపతులు తెలిపారు. తొలిసారిగా అక్కమహాదేవతల్లో ఒకరైన చిన్నగిరి మల్లమ్మ ప్రతిమ గ్రామంలో అడుగు పెట్టడంతో మహిళలు పసుపు, కుంకుమ సమర్పించి పూజలు చేశారు.

దొణరామేశ్వరాలయంలో పూజలు


అలంకరణలో దొణ రామేశ్వరుడు

శింగనమల: మండలంలోని చిన్నజలాలపురం సమీపంలోని దొణ రామేశ్వరాలయంలో శ్రావణ మాసం మూడో సోమవారం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు మూలవిరాట్‌ను పూలతో అలంకరించి అభిషేకం చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో శింగనమల, చిన్నజలాలపురం, వెస్ట్ నరసాపురం, గురుగుంట్ల, నాగులగుడ్డం గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

యూపీఎస్ అమలుపై సంబరాలు


కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న డీజల్ షెడ్ ఉద్యోగులు

గుంతకల్లు: యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యూపీఎస్) అమలుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపడంపై స్థానిక డీజల్ షెడ్‌లో రైల్వే ఉద్యోగులు సంబరాలు చేసుకున్నారు. దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో డీజల్ షెడ్ కార్మికులు, ఉద్యోగులు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మస్తాన్‌వలి, జీవన్‌బాబు, గౌస్, వై.సుధాకర్, నజీర్, మోహన్, నాగశేఖర్, బాషా తదితరులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల చిరకాల వాంఛ పెన్షన్ సాధన అన్నారు. అనేక ఏళ్లుగా రైల్వే ఉద్యోగులు ఎన్నో పోరాటాలు చేసిన ఫలితంగా పెన్షన్ విధానంలో కొన్ని మార్పులు చేసి యూపీఎస్‌ను అమలుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం హర్షణీయమన్నారు.

బస్సు సర్వీసుల ప్రారంభం


బస్సు సర్వీసులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జయరామ్

గుంతకల్లుటౌన్: గుంతకల్లు ఆర్టీసీ డిపో నుంచి మూడు కొత్త బస్సు సర్వీసులను స్థానిక ఎమ్మెల్యే జయరామ్ ప్రారంభించారు. కృష్ణాష్టమి సందర్భంగా సోమవారం స్థానిక ఆర్టీసీ డిపోలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పూజలు చేసి కొత్త బస్సులకు జెండా ఊపారు. గుంతకల్లు నుంచి అనంతపురానికి రెండు సర్వీసులు, తిరుపతికి అదనంగా మరో బస్సు సర్వీసును ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ బాలాజీ దయాళ్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నివాళి


ఉమామహేశ్వరరెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

పెద్దవడుగూరు: మండలంలోని చిన్నవడుగూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఉమామహేశ్వరరెడ్డి రెండు రోజుల క్రితం గుండెపోటుతో తిరుపతి స్విమ్స్ ఆస్పత్రిలో మృతి చెందాడు. ఆదివారం రాత్రి 9:30 గంటలకు ఆయన మృతదేహం స్వగ్రామానికి చేరుకోవడం తో జిల్లా నలుమూలల నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు, టీడీపీ శ్రేణులు తరలివచ్చాయి. అలాగే తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సతీమణి కేతిరెడ్డి రమాదేవి తదితరులు మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. అండగా ఉంటామని హామీ ఇచ్చారు. మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన అంతిమయాత్రలో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సౌకర్యాలు మెరుగు పరచాలి

తాడిపత్రి ఏరియా ఆసుపత్రి కొత్త బిల్డింగ్ అయినప్పటికి పూర్తి స్థాయిలో సౌకర్యాలు లేవు. తాగునీటి సౌకర్యం, వైద్యులు, సిబ్బంది డ్రస్సు మార్చుకునేందుకు గదులు లేవు. బాత్‌రూంలు, మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి. అత్యవసరమైతే ఇంటికి వెళ్లాల్సి వస్తోంది. సమస్యలను ఎమ్మెల్యేతోపాటు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. వారు స్పందించి సౌకర్యాలు మెరుగుపరచాలి.

– డేవిడ్ సెల్వన్ రాజ్, తాడిపత్రి ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్



భద్రతకు ప్రాధాన్యమివ్వాలి

వైద్య సిబ్బంది భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యమివ్వాలి. వైద్య సిబ్బందికి రక్షణ కల్పిస్తే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించే అవకాశం ఉంటుంది. కలకత్తాలో ట్రైనీ డాక్టర్ హత్య లాంటి దుర్ఘటనలకు తావు లేకుండా కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు ముందస్తు చర్యలు చేపట్టాలి. ముఖ్యంగా మహిళా డాక్టర్లు, సిబ్బందికి రక్షణగా ఆస్పత్రుల్లో మహిళా కానిస్టేబుళ్లను నియమించాలి.

– అప్పయ్య, రాయలచెరువు పీహెచ్‌సీ వైద్యుడు, యాడికి మండలం



ముకుందా.. మురారీ

గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల నియోజకవర్గాల్లో కృష్ణాష్టమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శ్రీకృష్ణుడి చిత్రపటాలు, విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో ఊరేగించారు. ఆలయ కమిటీలు, యాదవుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాల్లో రాధాకృష్ణుల వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

- ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు
- కిటకిటలాడిన ఆలయాలు


పెద్దపప్పూరు మండలం నరసాపురంలో శ్రీకృష్ణుడి ఉత్సవమూర్తిని పల్లకీలో ఊరేగిస్తున్న భక్తులు

గుంతకల్లు: పట్టణంలోని టీటీడీ కళ్యాణమండం ఎదురుగా ఉన్న శ్రీ కృష్ణ ఆలయంలో కృష్ణాష్టమి ఉత్సవాలు మిన్నంటాయి. వేకువజామునే శ్రీకృష్ణుని మూలవిరాట్‌కు ఫల పంచామృతాభిషేకం గావించారు. వెన్న, డ్రైఫ్రూట్స్‌తో మూలవిరాట్‌కు అలంకరించారు. గో పూజ, విష్ణు సహస్రనామ సోత్రముల పారయణ, శ్రీ కృష్ణ నామ కీర్తనాలు అలాపన చేపట్టారు. సాయంత్రం ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించిన అనంతరం శ్రీ కృష్ణుడి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో కొలువుదీర్చి గ్రామోత్సవం చేశారు. ఈ సందర్భంగా డీఆర్‌ఎం విజయ్‌కుమార్ దంపతులు, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తదితరులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే మండలంలోని ఎస్.తిమ్మాపురం గ్రామంలోని కావేటి వేణుగోపాల్ స్వామి ఆలయలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. బెంగుళూరు తెప్పించిన వివిధ రకాల పుష్పాలతో మూలవిరాట్‌ను ముస్తాబుచేశారు.

గుత్తి రూరల్: మండలంలోని కొత్తపేట, టి.కొత్తపల్లి, ఎంగిలిబండ, బసినేపల్లి, బేతాపల్లి, ధర్మాపురం, గొందిపల్లి, తొండపాడు, ఇసురాళ్లపల్లి, గాజులపల్లి, జక్కలచెరువు, శ్రీపురం గ్రామాల్లో సోమవారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించా. రాధ, కృష్ణల వేషధారణలతో చిన్నారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కృష్ణాష్టమిని పురస్కరించుకొని శ్రీ కృష్ణ చిత్రపటాన్ని కొత్తపేట నుంచి గుత్తి పట్టణం వరకూ ఊరేగించారు. ఊరేగింపులో కోలాటాలు, చక్క భజనలు చేశారు.

యాడికి: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో సోమవారం కృష్ణాష్టమి వేడులకను ప్రజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మండల కేంద్రంలో గంగమ్మ గుడి ఆలయం ఆవరణలో వెలసిన శ్రీకృష్ణుడి మూలవిరాట్‌కు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, యాడికి ఉప సర్పంచు కాసా చంద్రమోహన్, ఎంపీటీసీలు నాగరాజు, రామోహన్, యాదవ కుల సంఘం సభ్యుల ఆధ్వర్యంలో పూజలు చేశారు. యాడికిలో నిర్వహించిన ఉట్టి కొట్టే పోటీల్లో గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం స్వామి పల్లకీ సేవను గ్రామస్తులు భక్తి శ్రద్దలతో నిర్వహించారు.

పెద్దపప్పూరు: మండలంలోని నరసాపురం, పెద్దపప్పూరు.శింగనగుట్టపల్లి గ్రామాల్లో సోమవారం క్రిష్టాష్టమి వేడుకలు ఘనంగా ప్రాంరభించారు. నరసాపురంలో బాలక్రిష్ణుడి ఉత్సవమూర్తిని త్రైత సిద్దాంత ప్రభోద సేవా సమితి భక్తులు ఊరేగించారు. పలు గ్రామాల భజన బృందం సభ్యులు ఆలపించిన భక్తిగీతాలు ఆకట్టుకున్నాయి. మంగళవారం పెద్దపప్పూరులో స్వామి ఉత్సవమూర్తిని ఊరేగింపు అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేసినట్లు క్రిష్ణ స్వామి ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

గార్లదిన్నె: మండలంలోని సంజీవపురం,కల్లూరులో సోమవారం కృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంజీవపురంలోని శ్రీకృష్ణ దేవాలయంలో మూలవిరాట్‌ను ప్రత్యేక అలంకరించి అభిషేకాలు, అర్చన, పూజలు చేశారు. అలాగే కల్లూరులో శ్రీకృష్ణ విగ్రహాన్ని భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అలాగే శ్రీకృష్ణ వేషధారణలో చిన్నారులు అలరించారు.

పామిడి: పట్టణంలోని కొత్త ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో త్రైత సిద్ధాంతం, ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞాన వేదిక కమిటీ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీకృష్ణుడి ప్రతిమను ఏర్పాటుచేసి ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ సభ్యులు సూర్యనారాయణ, శివారెడ్డి. చంద్రశేఖర్ శ్రేష్టి, నారపరెడ్డి, వెంకటేష్, రామయ్య, భక్తులు పాల్గొన్నారు.


పామిడిలో శ్రీకృష్ణుడి ప్రతిమను ఏర్పాటు చేసిన దృశ్యం


గుత్తి మండలం శ్రీపురంలో కృష్ణుడు


గుంతకల్లులో వెన్న, డ్రైఫ్రూట్స్ అలంకరణలో శ్రీ కృష్ణుడు


గుంతకల్లు మండలం తిమ్మాపురంలో కావేటి వేణుగోపాల్ స్వామి


యాడికిలో శ్రీకృష్ణుని విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన దృశ్యం


గార్లదిన్నె మండలం సంజీవపురంలో ప్రత్యేక అలంకరణలో శ్రీకృష్ణుడు

రైలు ఢీ కొని రైతు మృతి

గుత్తి: స్థానిక రైల్వే జీఆర్పీ పరిధిలోని ఉప్పర్లపల్లి-పగిడిరాయి గ్రామాల మధ్య సోమవారం రైలు ఢీకొని ఓ రైతు మృతి చెందాడు. వివరాలు.. కర్నూలు జిల్లా జొన్నగిరికి చెందిన రైతు పెద్దపాపన్న (54)కు ఉప్పర్లపల్లి సమీపంలో పొలం ఉంది. సోమవారం పొలం పనులు ముగించుకుని ఇంటికి వెళుతూ పట్టాలు దాటుతుండగా ప్రమాదశాత్తు రైలు ఢీ కొంది. ఘటనలో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయకు భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు జీఆర్పీ ఎస్ఐ నాగప్ప తెలిపారు.

ఐరన్ షాపులో చోరీ

గుత్తి: పట్టణంలోని తాడిపత్రి రోడ్డులో సమీన్ ఐరన్ అండ్ సిమెంట్ ట్రేడర్స్ షాపులో చోరీ జరిగింది. దొంగలు రూ. 15 వేలు నగదు అపహరించారు. వివరాలు.. ఐరన్ షాపు యజమాని జమీర్ ఆదివారం రాత్రి పది గంటల సమయంలో షాపును క్లోజ్ చేసి ఇంటికెళ్లాడు.తిరిగి సోమవారం ఉదయం షాపును ఓపెన్ చేశాడు. అయితే పైన కన్నం వేసి ఉండటాన్ని గమనించాడు. క్యాష్ బ్యాక్స్‌ను పరిశీలించగా అందులో ఉన్న రూ. 15 వేలు కనిపించ లేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్ఐ నబీరసూల్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ట్రాక్టర్ కింద పడి వ్యక్తి మృతి

తాడిపత్రి: ట్రాక్టర్ కిందపడి కదిలి సుదర్శన్ (35) అనే వ్యక్తి మృతి చెందిన సంఘటన తాడిపత్రి పట్టణంలోని నందల పాడులో సోమవారం చోటు చేసుకుంది. హమాలీ పని చేసే సుదర్శన్ ఓబులేసు అనే వ్యక్తి ట్రాక్టర్ ఇంజన్ వెనుక భాగం నుంచి ట్రాలీలోనికి ఎక్కుతున్న సమయంలో ట్రాక్టర్ ముందుకు కదిలింది. దీంతో సుదర్శన్ కిందపడ్డాడు. అదే సమయంలో ట్రాలీ టైర్ సుదర్శన్ మీద పోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అతడికి భార్య రమాదేవి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

పెద్దవడుగూరు: మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో 67వ జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనం డివైడర్‌ను ఢీకొని శివయ్య (55) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. ఆయన రాయలచెరువు నుంచి సోమవారం సొంతూరుకు బైక్‌లో వస్తుండగా మార్గమధ్యలో క్రిష్టిపాడుకు చెందిన ఓ వ్యక్తిని ఢీకొన్నాడు. అనంతరం డివైడర్‌ను ఢీకొన్నాడు. ఘటనలో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చిన్నరెడ్డప్ప తెలిపారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

గుత్తి రూరల్: మండలంలోని రజాపురం గ్రామ శివారులో పంట పొలాల్లో సోమవారం విద్యుదాఘాతంతో ఓ ఆవు మృతి చెందగా మహిళా రైతు లక్ష్మీదేవి గాయపడింది. వివరాలు.. గ్రామానికి చెందిన లింగేశ్వర, లక్ష్మీదేవి దంపతులు రెండు ఆవులను మేపడంతో పాటు వేరుశనగ పొలంలో సేద్యం పనులు చేస్తున్నారు. అదేసమయంలో భారీ గాలులకు పొలంలో ఉన్న విద్యుత్ స్తంభం వారిపై పడింది. స్తంభం పడిన సమయంలో విద్యుత్ సరఫరా ఉండటంతో అక్కడికక్కడే ఒక ఆవు మృతి చెందగా మరో ఆవు తీవ్రంగా గాయపడింది. లక్ష్మీదేవి స్వల్పంగా గాయపడింది. రూ.1.65 లక్షలు నష్టం వాటిల్లిందని విద్యుత్, రెవెన్యూ అధికారులు స్పందించి ఆదుకోవాలని రైతు లింగేశ్వర ఫిర్యాదు చేశాడు. విద్యుత్ అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించి విచారిస్తున్నారు. కాగా పొలంలో ఉన్న స్తంభం కింద చీలికలు వచ్చాయని, ఎప్పుడైనా ప్రమాదం జరిగే అవకాశం ఉందని పలు మార్లు విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని బాధిత రైతు వాపోయాడు.

చోరీ కేసును ఛేదిస్తాం


చోరీ జరిగిన ఇంటిని డాగ్ స్క్వాడ్‌తో పరిశీలిస్తున్న సీఐ కౌలుట్లయ్య

నార్పల: మండల కేంద్రంలో ఆదివారం రాత్రి జరిగిన చోరీ కేసును వెంటనే ఛేదిస్తామని సీఐ కౌలుట్లయ్య అన్నారు. సోమవారం ఆయన చోరీ జరిగిన ఇంటిని డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంతో కలసి వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రలోని పుల్సలనూతల రాముడు ఇంట్లో ఆరు తులాలు బంగారం, వెండి పట్టీలు చోరీ చేశారన్నారు. దొంగలను గుర్తించి పట్టుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ సాగర్, సిబ్బంది పాల్గొన్నారు.

మదర్ థెరిస్సాను ఆదర్శంగా తీసుకోవాలి


గుంతకల్లులో మదర్ థెరిస్సా విగ్రహానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం


యాడికిలోని అగాపే ఆశ్రమంలో కేకు కట్ చేస్తున్న ప్రసాద్

గుంతకల్లు: మానవతామూర్తి మదర్ థెరిస్సాను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ప్రభుత్వాస్పత్రి వైద్యుడు జయవర్ధన్‌రెడ్డి అన్నారు. జేవీవీ ఆధ్వర్యంలో మదర్ థెరిస్సా జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని టీవీ టవర్ సమీపంలో మదర్ థెరిసా విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి అయన ముఖ్య అతిథిగా హాజరై థెరిస్సా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు జేవీవీ నాయకులు గంగరాజు, హరిప్రసాద్, వేణుగోపాల్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

యాడికి: మండల కేంద్రంలోని కమలపాడు రహదారిలో ఉన్న అగాపే వృద్ధాశ్రమంలో సోమవారం ఆశ్రమ వ్యవస్థాపకుడు ప్రసాద్ తదితరులు మదర్ థెరీస్సా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆశ్రమ ఆవరణలో మదర్ థెరీస్సా చిత్ర పటానికి క్షీరాభిషేకం చేసి కేకు కట్ చేశారు. కార్యక్రమంలో వృద్ధులు పాల్గొన్నారు.

కళ్లకు గంతలు కట్టుకుని నిరసన


కల్లూరులో సమ్మె చేస్తున్న సత్యసాయి కార్మికులు


బీకేఎస్‌లో ఆందోళన చేస్తున్న కార్మికులు

గార్లదిన్నె/బుక్కరాయసముద్రం: గార్లదిన్నె మండలంలోని కల్లూరులో సోమవారం సత్యసాయి కార్మికులు ఐదో రోజు కళ్లకు గంతలు కట్టుకుని సమ్మె చేశారు. వారు మాట్లాడుతూ గత ఆరు నెలల నుంచి జీతాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. 600 గ్రామాలకు నీటి సరఫరా ఆగిపోయినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కార్మికులకు జీతాలు వెంటనే మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో సత్యసాయి కార్మికులు నాగ భూషణ, మల్లరాయుడు, జనార్దన్ రెడ్డి, శ్రీనివాసులు, సాంబశివ, ఈశ్వరయ్య, శంకర్ తదిత రులు పాల్గొన్నారు. అలాగే బీకేఎస్ మండల కేంద్రంలోని సత్యసాయి వాటర్ సరఫరా ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట చేపట్టిన ఆందోళనలో కార్మిక సంఘం నాయకులు రాఘవేంద్రాచారి, దేవదాస్, కిష్టప్ప, లక్ష్మిన్న, పెద్దన్న, నల్లప్ప, భాస్కర్, నారాయణ, విశ్వరూప, గంగప్ప కుమార్, నరేష్, విశ్వనాథ్ నరహరి, తదితరులు పాల్గొన్నారు.

సిఫారసు కోసం ఎమ్మెల్యే ఇంటికి క్యూ

- తాడిపత్రి నియోజకవర్గంలో పోస్టింగ్‌కు అధికారుల యత్నాలు



తాడిపత్రి రూరల్: జిల్లాలో మిగిలిన నియోజకవర్గాల రాజకీయాలకు భిన్నం తాడిపత్రి. ఇక్కడి కూటమి నేతల కనుసన్నల్లో అధికార యంత్రాంగం పనిచేయాల్సి ఉంటుంది. అందుకు అనుగుణంగా పనిచేసేవారికే ఇక్కడ ప్రాధాన్యత ఉంటుంది. గతంలో వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా పనిచేశారన్న వారిపై ఇప్పటికే కూటమి నేతలకు మండల నాయకుల నుంచి ఫిర్యాదులు వెళ్లాయి. వారి స్థానంలో తమకు అనుకూలంగా ఉన్నవారిని నియమించాలని ఒత్తిడి తెస్తున్నారు.

సిఫారసు లేఖలకే ప్రాధాన్యం

తాడిపత్రి నియోజకవర్గంలో పోస్టింగ్ కోసం ప్రయత్నించే అధికారులు, సిబ్బంది మొదట కూటమి ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి సిఫారసు లేఖలు కావాలని ఖరాఖండిగా చెపుతున్నట్లు తెలుస్తోంది. సిఫారసు లేఖలు తీసుకువచ్చిన తరువాత చేయి తడిపే విషయాల గురించి మాట్లాడుకుందామంటున్నారని వినికిడి. దీంతో ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్ సిఫారసు లేఖల కోసం తాడిపత్రిలోని వారి నివాసానికి క్యూ కడుతున్నారు. ప్రస్తుతం మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి హైదరాబాద్‌లో విశ్రాంతి తీసుకుంటున్నారు. తాడిపత్రిలో ఉంటున్న ఎమ్మెల్యే వద్దకు స్వయంగా కొందరు, మద్దతుదారులను పిలుచుకుని మరికొందరు సిఫారసు లేఖల కోసం వెళుతున్నారు.

ఈనెల 27లోపు ఆన్‌లైన్ దరఖాస్తులు

కీలకమైన 15 శాఖలకు సంబంధించి ఉన్నతాధికారులు బదిలీలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. వాటిలో మునిసిపాలిటీ, రెవెన్యూ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, వార్డు సచివాయాలు తదితర శాఖలు ఉన్నాయి. బదిలీలకు సంబంధించి ఈనెల 27లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు ఆదేశించారు. దీంతో కొందరు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేస్తునే మరోవైపు సిఫారసు లేఖలకు గట్టిగానే ప్రయత్నిస్తున్నారు. గతంలో తాడిపత్రి నియోజక వర్గంలో పనిచేసి కూటమి నేతల మెప్పు పొంది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాకతో బదిలీలపై వెళ్లిన వారు తిరిగి తాడిపత్రి ప్రాంతానికి రావడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఐదేళ్ల సర్వీసు నిండిన వారితో పాటు రెండు, మూడు ఏళ్ల సర్వీసు ఉన్న వారు కూడా బదిలీ ప్రయత్నాలు చేస్తున్నారు. కూటమి నేతలతో సన్నిహిత సంబంధాలు ఉన్నవారితో పాటు బంధువర్గం గల ఉద్యోగులు సైతం తాడిపత్రి ప్రాంతంలో పోస్టింగ్ కోసం శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. మరోవైపు ఇక్కడ పనిచేస్తున్న పలువురు అధికారులు, సిబ్బంది సైతం తమ అనుకూలంగా ఉన్న ప్రాంతాలకు బదిలీ చేయించుకునేందుకు అక్కడి కూటమి నేతల వద్దకు వెళ్లి సిఫారసు లేఖల కోసం ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే తాడిపత్రి నియోజక వర్గంలో కూటమి నేతల ఒత్తిడులను తట్టుకోలేక బదిలీ ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సిఫారసు లేఖలు తీసుకొచ్చిన వారితో సైతం ఉన్నతాధికారులు బేరసారాలు ఆడుతున్నారని సమాచారం. పోస్టును బట్టి రూ.లక్షలు డిమాండ్ చేస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. అడిగినంత డబ్బు ముట్టజెప్పితే కోరిన ప్రాంతానికి పోస్టింగ్ ఇస్తామని, లేకపోతే సిఫారసు లేఖలు ఉన్నా ఏదో ఒక కారణంతో పక్కన పెడుతామని బెదిరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మధ్యవర్తుల ద్వారా ఉన్నతాధికారులతో బేరసారాలు అడుతున్నారని సమాచారం. మొదట కొంత సొమ్ము అడ్వాన్స్‌గా ఇచ్చి పోస్టింగ్ ఇచ్చిన తరువాత మిగిలిన మొత్తాన్ని ఇచ్చేందుకు బప్పందం కుదుర్చుకుంటునట్లు తెలుస్తోంది.

రాయితీతో ఉలవల పంపిణీ

బుక్కరాయసముద్రం: రైతులకు ఉలవ విత్తనాలను రాయితీతో అందిస్తున్నట్లు ఏఓ శ్యాంసుందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలో ఖరీఫ్ సీజన్‌లో ఎటువంటి పంట సాగు చేయని రైతులకు ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా ఉలవ విత్తనాలు 80 శాతం రాయితీతో అందిస్తోందన్నారు. కిలో విత్తనం రాయితీ పోనూ రైతులు రూ.17 చెల్లించాలన్నారు. ఎకరాకు 10 కిలోలు, రెండు ఎకరాలకు 20 కిలోలు, 3 ఎకరాలకు 30 కిలోలు, 4 ఎకరాలకు 40 కిలోలు, 5 ఎకరాల ఉన్న రైతులకు 50 కిలోల విత్తనం అందజేస్తామన్నారు. విత్తనం అవసరమైన రైతులు రైతు సేవా కేంద్రంలో ఆధార్, భూమి పాసుపుస్తకం జిరాక్స్‌లు అందజేసి రిజిస్టర్ చేయించుకోవాలన్నారు.

ఆలయం వద్ద అన్నదానం

పుట్లూరు: మండల కేంద్రంలోని పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ శింగనమల నియోజకవర్గ కో కన్వీనర్ శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో 45 వారాలుగా దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమంనిర్వహిస్తున్నారు.